
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

బుధవారం 5 ఫిబ్రవరి 2025



మోదుగుపూల సోయగం

రహదారి వెంట మోదుగుపూలు కనువిందు చేస్తున్నాయి. ఆకులు రాలి.. చెట్లు మోడువారినట్లు ఉండగా.. ఎర్రటి పూలు ఆకర్షణీయంగా కనపిస్తున్నాయి. సంగారెడ్డి శివార్లలో కనిపించిన ఈ దృశ్యం ఆకట్టుకుంటున్నది.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



జోర్దార్ జాతర..

నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో తిరుమల బండపై వెలసిన తిరుమలయ్య ఆలయంలో బ్రహ్మోత్సవాలు, జాతర ఘనంగా జరుగుతున్నాయి. రథ సప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

-నిజాంపేట, (ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డి జిల్లాలో 276 ఎంపీటీసీలు

19 స్థానాలు కోత

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో 276 మండల ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ) స్థానాలను గుర్తిస్తూ జిల్లా పరిషత్ సీఈవో జానకిరెడ్డి మంగళవారం ముసాయిదాను విడుదల చేశారు. జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఈ వివరాలను ప్రదర్శన కోసం ఉంచారు. గతంతో పోలిస్తే ఈసారి 19 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఇంతకుముందు 295 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. తాజాగా విడుదల చేసిన ముసాయిదా ప్రకారం 276 స్థానాలు ఉన్నాయి. 632 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో అత్యల్పంగా గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్ మండలాల్లో 5 ఎంపీటీసీ స్థానాల చొప్పున ఉండగా.. హత్నూర మండలంలో అత్యధికంగా 16 ఎంపీటీసీ స్థానాలుం ఉన్నాయి. నారాయణఖేడ్ 15, న్యాల్‌కల్ 15, సదాశివపేట 14, కంది 14, జహీరాబాద్ 13, ఝరాసంగం 13, కోహీర్ 13, రాయికోడ్ 12, మునిపల్లి 12, కొండాపూర్ 12, కంగ్టిలో 12, మొగుడంపల్లి 11, మొగుడంపల్లి 11, అందోలు 11, పటాన్‌చెరు 10, పుల్కల్‌లో 9, నాగలగిద్దలో 9, వట్‌పల్లిలో 9, సిర్గాపూర్‌లో 8, మనూర్‌లో 8, సంగారెడ్డిలో 7, చౌటకూర్‌లో 6, కల్హేర్‌లో 6, నిజాంపేటలో 6 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ముసాయిదాలో పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

పదిహేను రోజుల్లో షెడ్యూల్!

● ఏర్పాట్లలో అధికారగణం ● రిజర్వేషన్లపై సందిగ్ధం

పంచాయతీల సంఖ్య	493
వార్డులు	4,338
ఓటర్లు	5,21,488
కొత్త పంచాయతీలు	24
ఓటర్లు	3,990

గత ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇలా..

ఎస్సీ	15 శాతం
ఎస్టీ	7 శాతం
బీసీలకు	28 శాతం
మహిళలు	50 శాతం



మెదక్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పదిహేను రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ముందుగా సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ఓటర్ల జాబితాను రూపొందించింది. సంబంధిత అధికారులు పోలింగ్ బూత్‌లవారీగా ఏర్పాట్లు ప్రారంభించారు. కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు సంబంధించిన ఓటర్లను ఇంతకుముందు ఉన్న పంచాయతీల నుంచి తొలగించి, కొత్త పంచాయతీల్లో జాబితా తయారు చేశారు. నేటి వరకు అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. రేపు అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. 7వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించేందుకు కార్యాచరణ రూపొందించారు. 2019లో తీసుకువచ్చిన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు పది సంవత్సరాల పాటు అమలు చేయాల్సి ఉంటుంది. కానీ, ఆ చట్టాన్ని ప్రభుత్వం మార్చనున్నట్లు ఊహాగానాలు వినబడుతున్నాయి. గత ఎన్నికల్లో ఎస్సీలకు 15, ఎస్టీలకు 7, బీసీలకు 28 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. 50 శాతం సీట్లు మహిళలకు రిజర్వు అయ్యాయి. అప్పట్లో బీసీ నేతలు ఈవిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బీసీ గణన చేపట్టి రిజర్వేషన్లు కల్పించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ప్రస్తుత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన కమిషన్ నివేదికను సమర్పించింది.

మిగతా 8వ పేజీలో



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ అదనపు కలెక్టర్ మెంచు

వార్డులవారీగా ఓటరు జాబితా రూపొందించాలి

మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లోని ఓటరు జాబితాను అనుసరించి గ్రామ పంచాయతీ ఓటర్ జాబితాను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 493 గ్రామపంచాయతీల్లో 5,25,478 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ఈ నెల 7న ఓటరు తుది జాబితాను విడుదల చేయనున్నందున రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీ వార్డుల వారీగా బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీపీవో యాదయ్య, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ధర గిట్టుబాటు కాకపోవడంతో మాచునూర్ గ్రామంలో పొలంలోనే వదిలేసిన టమాట పంట

టమాట.. ఢమాల్

సీజన్ ప్రారంభంలో కిలో రూ. 20, ప్రస్తుతం కిలో రూ. 5 మాత్రమే

పడిపోయిన ధర.. పెట్టుబడి డబ్బులు తిరిగిరాక ఇబ్బందులు

ఝరాసంగం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాసులు కురిపిస్తుందని టమాట సాగుచేస్తే అప్పులపాలు చేస్తున్నది. ఎంతో ఆశతో పండించిన పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్ ప్రారంభంలో కిలో టమాటా రూ.20 ధర పలికింది. ప్రస్తుతం కిలో రూ.5కు పడిపోయింది. కూలీలు, రవాణా ఖర్చులు కూడా చేతికి రావడంలేదు. దీంతో, రైతులు పంటను తీయకుండానే పొలంలోనే వదిలేస్తున్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండలంలోని బొప్పన్‌పల్లి, కక్కర్‌వాడ, మాచూనూర్, కృష్ణాపూర్, కుప్పానగర్ తదితర గ్రామాల్లో రైతులు టమాటా పంటను అధికంగా సాగు చేశారు. కొద్దిరోజులు టమాటకు మార్కెట్‌లో 25 కిలోల బాక్స్ ధర రూ.800 నుంచి రూ. వెయ్యి వరకు పలికింది. ప్రస్తుతం రూ.150 కూడా రావడం లేదు. వారం రోజుల నుంచి పగటిపూట ఎండ తీవ్రత పెరగడంతో పొలంలోనే పంట దెబ్బతింటున్నది. దీంతో రైతులు కోతకు ముందుకురావడం లేదు.

కూలీ డబ్బులు తిరిగిరావడం లేదు



సీజన్ ప్రారంభంలో కొద్దిరోజులు టమాటకు మంచి ధర పలికింది. లాభాలు వస్తాయనే ఆశతో రెండెకరాల్లో సాగు చేశాను. పంట చేతికివచ్చి మార్కెట్‌కు తరలించే సమయానికి కూలీ డబ్బులు కూడా గిట్టుబాటు కావడంలేదు.

-జగన్, మాచునూర్

పాలన ముగిసె.. పనులు పూర్తికాలే!

- ఐదేళ్లలో నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధి అంతంతే..
- సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికే పరిమితం
- ప్రత్యేక నిధులున్నా సద్వినియోగం చేసుకోని వైనం
- అర్ధాంతరంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు

7లో

జిన్నింగ్ మిల్‌లో అగ్నిప్రమాదం

- సుమారు రూ. 1.5 కోట్ల నష్టం



7లో

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పగలు ఉక్కపోత.. రాత్రి చలి పంజా..

ఉమ్మడి జిల్లాలో వాతావరణంలో మార్పులు







మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో పగలు ఎండలు మండుతుండగా.. రాత్రిళ్లు చలి పంజా విసురుతున్నది. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కనిపిస్తోంది. రాత్రి 8 గంటల దాటకముందే చలి పెరుగుతోంది. ఫిబ్రవరి మొదటి వారంలోనే పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలకు చేరింది. రానున్న నాలుగు రోజులు పొగమంచు కురిసే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొన్నారు. జనవరి చివరి వారం నుంచి ఎండ తీవ్రత మొదలైంది. గాలుల దిశల మారడంతో ఈ నెలలో ఒక వారం చల్లగా.. మరో వారం వేడిగా ఉండే అవకాశముందని, వచ్చే నెల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. గతేడాది కంటే ఈసారి ఎండలు అధికంగా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలాగే నమోదయ్యే అవకాశాలు ఉండగా.. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. సీజన్ మారుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

ఉష్ణోగ్రతలు ఇలా..

గడిచిన 24 గంటలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా అల్మాయిపేటలో 36.8 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా సముద్రాలలో 38.8 డిగ్రీలు, మెదక్ జిల్లా కాగజ్‌మద్దూర్ 36.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కనిష్ఠ ఉష్ణోగ్రతలు..

సంగారెడ్డి అల్గోల్, కోహీర్ 11.9 డిగ్రీలు, అల్మాయిపేట 12.6, మెదక్ జిల్లా దామరంచ 13.5, వెల్దుర్తి 13.8, బేగంపేటలో 14.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు

మున్సిపాలిటీలో విలీనం?

గజ్వేల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమైనట్లు తెలుస్తుంది. ఎన్నో రోజులుగా సందిగ్ధంలో ఉన్న గ్రామపంచాయతీల విలీనం ఇక లాంఛనమేనని అధికారులు చెబుతున్నారు. కొన్నాళ్లుగా ఈ విషయమై అనేక రకాల ప్రశ్నలు తలెత్తగా తాజాగా రెండో విడత పంచాయతీరాజ్ ర్యాండమైజేషన్‌లో భాగంగా కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, అక్కన్నపేట మండలంలోని గుడాటిపల్లి, సిద్దిపేట రూరల్ మండలాలకు సంబంధించిన గ్రామాల్లో తుది ఓటరు జాబితాను ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలోనే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన ఏటిగడ్డ కిష్టాపూర్, వేములాఘాట్, రాంపూర్, లక్ష్మాపూర్, పల్లెపహడ్, ఎర్రవల్లి, బ్రాహ్మణ బంజేరుపల్లి, తిప్పారం మధిర గ్రామమైన సింగారం గ్రామాలకు సంబంధించి ఏ నిర్ణయం వెల్లడించకపోవడంతో మున్సిపాలిటీల్లో విలీనం లాంఛనమైనట్లే సమాచారం. వాస్తవానికి రెవెన్యూ పరిధి మునిసిపాలిటీలోనే ఉండడంతో గ్రామపంచాయతీలుగా కొనసాగించడం అసాధ్యమని, టెక్నికల్‌గా ఇది సాధ్యం కాదని తెలుస్తుంది.

మూడో వారమూ తగ్గిన

ఆలయ బుకింగ్ ఆదాయం



కొమురవెల్లి మల్లన్న దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు

- గతేడాది రూ.55.70 లక్షలు, ఈసారి రూ.43.28 లక్షలు మాత్రమే
- మూడువారాలుగా తగ్గుముఖం
- వెనుకదారిగుండా వేలాది మంది..!

చేర్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీవారం వేలాదిగా భక్తులు తరలివస్తున్నా గతేడాది కన్నా బుకింగ్ ఆదాయం తగ్గుతుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడు వారాలుగా ఆదాయం తగ్గుతుండటంతో ఆలయవర్గాలు తలపట్టుకుంటున్నారు. ఇటీవల ముగిసిన మూడోవారం జాతర సందర్భంగా తరలివచ్చిన భక్తులు సమర్పించిన మొక్కుబడులు, తలనీలాలు, ఆర్జితసేవలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, విరాళాలు, ఇతరత్రా రూపంలో శనివారం రూ.3,33,341, ఆదివారం రూ.32,71,796, సోమవారం రూ5,63,545, షాపుల అద్దె ప్రాథమిక చెల్లింపు రూ.1,60,060 ద్వారా రూ.43,28,742 ఆదాయం సమకూరింది. గతేడాది రూ.55.70 లక్షలు ఆదాయం సమకూరగా, ఈ సారి సుమారు రూ.13 లక్షల మేర తగ్గింది. మొదటి వారం రూ.9లక్షలు, రెండో వారం రూ.16.55లక్షలు, మూడోవారం రూ.13లక్షల చొప్పున జాతర మూడు వారాల్లో సుమారు రూ.40లక్షల ఆదాయం తగ్గడం పట్ల సందేహాలు తలెత్తుతున్నాయి.



మెడికల్ కాలుజీని తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వైద్య విద్యార్థులకు ఏ ఇబ్బంది రావొద్దు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ● మెడికల్ కాలేజీలో ఆకస్మిక తనిఖీ

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లికొట్టాల్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య విద్యార్థులతో మాట్లాడి బోధన ఎలా సాగుతున్నదో తెలుసుకున్నారు. క్యాంటీన్ నిర్వహణ, ల్యాబ్ నిర్వహణను పరిశీలించారు. హాస్టల్, వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈట రవీంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ జయ, సూపరిండెంట్ శివదయాళ్ తదితరులు పాల్గొన్నారు.

నవ వధువుకు వరకట్నం కాటు

- అత్తింటివారి వేదింపులు తాళలేక ఉరేసుకుని ఆత్మహత్య
- హత్యచేశారని వధువు తల్లిదండ్రుల ఆరోపణ
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో అత్తింట్లో అడుగు పెట్టిన నవ వధువును వరకట్నం కాటేసింది. కంటికి రెప్పాలా చూసుకుంటాడు అనుకున్న భర్త, అత్తింటి వారు డబ్బు డిమాండ్ చేయడంతోపాటు చిత్రహింసలకు గురి చేయడంతో నవ వధువు బలవంతంగా తనువు చాలించింది. ఈ ఘటన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణం సాకేత్‌నగర్ కాలనీకి చెందిన సాయికి నవంబర్ 7న సంగారెడ్డి జిల్లా మునిపల్లి గ్రామానికి చెందిన శ్రీజ(21)తో వివాహం జరిగింది. వివాహ సమయంలో తల్లిగారి ఇంటి వద్ద వివాహం జరిపించి కట్నం కింద రూ. 2 లక్షల నగదు, 12 తులాల బంగారం, ఒక బైక్‌ను ఇచ్చారు. నెల రోజుల పాటు సాఫీగా సాగిన వారి జీవితంలో వరకట్నం వేధింపులు మొదలయ్యాయి. అదనంగా మరో రూ.3 లక్షలు కావాలని భర్తతో పాటు అత్తింటి వారు డిమాండ్ చేయడంతో శ్రీజ ఈ విషయాన్ని తన తల్లికి తెలియజేసింది. దీంతో ఏం గొడవలు జరుగుతాయోనని ఆందోళన.. అత్తింట్లో బాధలు తప్పవని భావించిన శ్రీజ సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని సాయి తండ్రి అనంతయ్య ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో శ్రీజ తల్లిదండ్రులు, బంధువులు వికారాబాద్‌కు చేరుకుని శ్రీజను మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. అత్తింటివారు తన కూతురును వరకట్నం కోసం హత్య చేశారని మండిపడ్డారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సాయి కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి శ్రీజ కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. శ్రీజ తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.


శ్రీజ(ఫైల్)



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆహారపు అలవాట్ల మార్పుతో కేన్సర్ దూరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆహారపు అలవాట్ల మార్పు చేసుకోవడం ద్వారా కేన్సర్ రాకుండా కాపాడవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, ప్రోగ్రాం ఆఫీసర్ డా.శశాంక్, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కే.అరుణాబాయి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగం, హెల్త్‌క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

కొల్చారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు శాలువాతో సన్మానం చేశారు. అనంతరం రాంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు నెల్లి రాజు, యేసు, ఆకుల మధు, కొటాల మధు రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

హత్నూర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ భవాని స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామీజీ హాజరై భక్తులకు ప్రవచనాలు బోధించారు. అనంతరం గ్రామంలో రథోత్సవం, శివపార్వతుల పల్లకీ ఉత్సవం అర్చకులు ప్రదీప్‌శర్మ, మాణిక్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేపీ మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ ఎంపీపీ నర్సింలు, తాజా మాజీ సర్పంచ్ వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య



మాట్లాడుతున్న బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల గొంతుక అవుతానని బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య అన్నారు. పట్టణంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయేలా తెచ్చిన 317 జీవో సమస్య కేంద్ర ప్రభుత్వ దృష్టి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేష్, రామారావు, దుబాషి భాస్కర్, దేశ్ భాస్కర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

- టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కుమార్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యూటీఎఫ్ బలపరిచిన టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి యాదగిరి, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగొద్దు : ఎస్పీ


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆలయం వద్ద ఏర్పాట్లను, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ఇందులో ఆలయ ఈవో చంద్రశేఖర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

మద్యం తాగుతూ ఆటోడ్రైవర్ మృతి

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కల్హేర్ మండలం మారిడి గ్రామానికి చెందిన రాజు(36) భార్య ఇద్దరు పిల్లలతో ఐడీఏబొల్లారంలో 15 ఏళ్లుగా నివాసముంటూ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం మద్యం దుకాణంలో మద్యం సేవిస్తూ కుర్చీలోనే నిద్రలోకి జారుకుని మృతిచెందాడు. మృతుడి తమ్ముడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

- సీనియర్ న్యాయవాది మృతి



కిషన్‌రావు(ఫైల్)

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ న్యాయవాది మంగళవారం మృతిచెందారు. నాగల్‌గిద్ద మండలం ఏస్గీకి చెందిన కిషన్‌రావు న్యాయవాదిగా పనిచేస్తూనే, దివంగత మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి అనుచరుడిగా టీడీపీలో చేరి, 1987లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో మనూరు ఎంపీపీకి పోటీచేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం ఆయన ఏస్గీ సర్పంచుగా, ఎంపీటీసీగా సేవలందించారు. సంగారెడ్డి, నారాయణఖేడ్ కోర్టుల్లో న్యాయవాదిగా సేవలందించారు. గత శుక్రవారం నారాయణఖేడ్‌లో భార్య కుమారుడితో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట నుంచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కిషన్‌రావును చికిత్స నిమిత్తం యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, సీనియర్ న్యాయవాది అనంత్‌రావుకులకర్ణి, తదితరులు వైద్యశాలకు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మరమ్మతులకు నోచని మసీదు



మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సుమారు 600 సంవత్సరాల క్రితం నిర్మించిన, గొప్ప సాంస్కృతిక, వారసత్వ చరిత్ర కలిగిన మెదక్ మండలంలోని కొంటూర్ మసీదు శిథిలావస్థకు చేరింది. నిర్వహణ సరిగా, మరమ్మతులకు నోచుకోక అక్కడక్కడ పెచ్చు లూడి రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో వానకాలంలో నీరంతా మసీదులోకి చేరి నమాజ్ చేసుకునే పరిస్థితి లేకుండా పోతుంది. గతంలో ఆర్కియాలజీ అధికారులు పలుమార్లు సందర్శించి మరమ్మతులు చేస్తామని హామీలిచ్చినా అమలుకాలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మరమ్మతులతో వారసత్వ కట్టడాన్ని కాపాడలని గ్రామస్థులు కోరుతున్నారు.



చీరతో.. పంటలకు రక్ష

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రబీ పంటలు చేతికి అందుతున్న దశలో అడవి పందుల బెడద తీవ్రం కావడంతో రైతులు పంటల రక్షణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు పొలాల్లో మెగాఫోన్లను వినియోగిస్తుంటే, మరికొందరు కాపలా ఉంటూ టపాసులు కాల్చుతున్నారు. ఇంకొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి పంట పొలాల చుట్టూ పాత చీరలను కడుతున్నారు. గాలికి రెపరెపలాడుతున్న రంగురంగుల చీరలు, వాటి శబ్దానికి అడవి పందులు బెదిరిపోయి పంటల పొలాల్లోకి రాకుండా అటునుంచి అటే పారిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. చీరలతో పొలాలకు కొత్త అందం వచ్చింది.

చెక్కతో.. చక్కని రూపాలు



మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో ఏ వస్తువైనా యంత్రాలతోనే తయారవుతున్నది. కానీ కామారెడ్డి జిల్లా గోపాల్ పేటకు చెందిన స్వామి మాత్రం తన చేతితోనే చెక్కలతో అందమైన కళారూపాలను తయారు చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. కొండపల్లి బొమ్మలకు ఏమాత్రం తీసిపోని విధంగా చక్కగా తయారు చేసి అందరి దృష్టి ఆకర్షిస్తున్నాడు. స్వామి కొన్ని రోజులుగా మెదక్ పట్టణంలోని అతిథుల విశ్రాంత భవనానికి వెళ్లే మార్గం ప్రధాన రహదారి పక్కన చిన్న ఆవాసం ఏర్పాటు చేసుకొని ఆయన తయారు చేసిన బొమ్మలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

కార్పొరేట్ శక్తులకు మేలు చేసే బడ్జెట్

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు



విజయ సూచిక చూపిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పెట్టుబడులు వస్తేనే అభివృద్ధి జరుగుతుందనే భ్రమలో ప్రభుత్వాలు ఉన్నాయని, అందుకే బడ్జెట్‌లో ప్రైవేటు రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. విపరీతంగా పెరుగుతున్న నిత్యవసర ధరల కట్టడికి చర్యలు చేపట్టడం లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌తో కార్మికులు, సామాన్య ప్రజానికానికి ఎలాంటి మేలు లేదని, ఇప్పటికైనా బడ్జెట్‌లో మార్పులు చేసి పేదలకు మేలు జరిగేలా రూపొందించాలన్నారు. పార్టీ ఫిరాయింపులు చట్ట వ్యతిరేకమని, బీఆర్ఎస్ నుంచి గెలుపొంది వారి స్వప్రయోజనాల కోసం పార్టీలు మారిన వారిపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని హై కోర్టు కూడా చెప్పిందని గుర్తు చేశారు. కానీ, రాజ్యాంగం కల్పించిన పదవిలో ఉండి కూడా స్పీకర్ ప్రభుత్వం చెప్పుచేతల్లో పనిచేయడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించే ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం తరపున డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, రాజయ్య, అడివయ్య, మల్లేశం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మందులను సక్రమంగా నిల్వచేయాలి

● సిద్దిపేట జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్



సెంట్రల్ డ్రగ్‌స్టోర్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖాధికారి పల్వన్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మందుల నిల్వలను సక్రమైన పద్ధతిలో భద్రపరచాలని సిద్దిపేట జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా స్టోర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా స్టోర్‌ను సందర్శించి మందుల నాణ్యత, రికార్డులు, వాక్సిన్ శీతలికరణ స్థితిని పరిశీలించారు. మందుల గడువుపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అక్కడినుండి సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడుతూ కూల్ రూమ్‌లో ఉంచాల్సిన మందుల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కచ్చితంగా నెలకు ఒకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులను పంపించాలని ఆదేశించారు. పీహెచ్‌సీల వైద్య అధికారులు వారికి కావలసిన ఇండెంట్‌ను ఈ ఔషధీ పోర్టల్ ద్వారా సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు నవీన్ రాజ్‌కుమార్, అనిల్‌కుమార్, ఫార్మసిస్టులు వెంకటేశ్వర్లు, మక్బూల్‌అలీ, ప్రశాంత్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పాలన ముగిసె.. పనులు పూర్తికాలే



అసంపూర్తిగా సమీకృత మార్కెట్ పనులు

ఐదేళ్లలో నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధి అంతంతే..

- సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికే పరిమితం
- ప్రత్యేక నిధులున్నా సద్వినియోగం చేసుకోని వైనం
- అర్థాంతరంగా నిలిచిపోయిన పలు ప్రగతి పనులు

నర్సాపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపల్ ఏర్పడిన తర్వాత మొదటి పాలకవర్గం ఐదేళ్ల పదవీ కాలం ముగిసినా చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేకపోయారు. సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం తప్పా చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు పూర్తి చేయలేకపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ మున్సిపాలిటీకి వచ్చిన రూ.45కోట్ల ప్రత్యేక నిధులనూ పూర్తిస్థాయిలో వినియోగించలేకపోయారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ నిధులు వెనక్కి వెళ్లడంతో పట్టణంలోని ప్రధాన అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

సగంలోనే సమీకృత మార్కెట్..

నర్సాపూర్ పట్టణంలో రూ.2 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులు ఏళ్లు దాటినా పూర్తిచేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక నిధులు నిలిచిపోవడంతో పనులూ సగంలోనే ఆగిపోయాయి. దీంతో పట్టణంలో కూరగాయలతో పాటు మాంసం విక్రయదారులు రోడ్లపైనే వ్యాపారాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది.

పూర్తయినా ప్రారంభానికి నోచుకోక..

కోటి రూపాయలతో ఆధునిక శ్మశాన వాటిక పనులు పూర్తయినా అందుకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లేక ప్రారంభానికి నోచుకోలేదు. వినియోగంలో లేక అందులో ఏర్పాటు చేసిన సామగ్రి దొంగల పాలవుతున్నది. డంప్‌యార్డుది దాదాపు ఇదే పరిస్థితి. రూ.50లక్షలతో ఆధునిక హంగులతో డంప్‌యార్డు నిర్మించారు. ఇంకా చిన్నచిన్న పనులు మిగిలిపోవడంతో వినియోగంలోకి తేలేకపోయారు. దీంతో సేకరించిన చెత్తనే అక్కడే ఖాళీ స్థలంలో వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా కంపుకొడుతున్నది.

అసలు మొదలుకానివి మరెన్నో..

పట్టణంలో అసంపూర్తి పనులేకాదు.. అసలు మొదలుకానివి మరెన్నో ఉన్నాయి. గత ప్రభుత్వం పార్కు ఏర్పాటుకు కోటి రూపాయలు, స్టేడియం నిర్మాణానికి రూ.2కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించినా ఇప్పటికే వాటి ఊసే లేదు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమైన తహసీల్దార్ కార్యాలయానికి కూడా సొంత భవనం లేక అతిథిగృహంలో అరకొర సౌకర్యాలతో సాగుతుంది. దీంతో పాటు ఆర్డీవో, కోర్టు, ఎక్సైజ్, సబ్‌రిజిస్ట్రార్, పీజీ కాలేజీ, మైనార్టీ గురుకులం, గిరిజన బాలికల గురుకులం తదితరవాటికీ సొంత భవనాలు కరవయ్యాయి. దీంతో నర్సాపూర్ పేరుకే డివిజన్, నియోజకవర్గ కేంద్రం తప్పా.. అనేక సమస్యలతో సతమతమవుతున్నది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన ఎలా సాగుతుందో చూడాలి.



చివరిదశలో ఆగిపోయిన మున్సిపల్ భవనం

తుది దశకు వచ్చినా..

నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయానికి సొంత భవనం లేక ప్రస్తుతం వెప్మా గ్రూపుకు సంబంధించిన భవనంలో అరకొర సౌకర్యాలతో కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో కొత్తగా మున్సిపల్ భవనం కోసం రూ.6 కోట్లు కేటాయించి ఆధునిక హంగులతో రెండతస్తుల భవనం నిర్మాణం చేపట్టగా, పనులు తుదిదశకు చేరుకున్నాయి. అనంతరం ప్రభుత్వం మారడం.. నిధులు రాకపోవడంతో అంతలోనే పనులు ఆగిపోయాయి. దీంతో మొదటి పాలకవర్గం హయాంలో కొత్త కార్యాలయంలోకి వస్తామని ఆశించినా వారి ఆశ నెరవేరకుండానే గడువు ముగిసిపోయింది.



డంప్‌యార్డును అందుబాటులోకి తేకపోవడంతో పక్కనే ఖాళీ ప్రదేశంలో చెత్త డంపింగ్

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



రామ్‌లాల్ (ఫైల్)

శివ్వంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం రాములు తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నవాబ్‌పేట్ పంచాయతీ పరిధిలోని రాములుతండాకు చెందిన పాల్త్య రామ్‌లాల్ (54) సోమవారం మధ్యాహ్నం భార్య లక్ష్మితో కలిసి పొలానికి వెళ్లాడు. వరి పంటకు నీళ్లు పెట్టేందుకు బోరు మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయాడు. వెంటనే భార్య లక్ష్మి, కొడుకు శ్రీకాంత్ రామ్‌లాల్‌ను సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



బాబు(ఫైల్)

వర్గల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన యువకుడిని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండల కేంద్రానికి చెందిన కొమ్ము బాబు(38) మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా తెలిసిన వారి వద్ద అప్పులు చేస్తూ మద్యం తాగుతున్నాడు. ఈ విషయమై ఆదివారం సాయంత్రం భార్య భాగ్య బాబును మందలించడంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు



పొలంలోకి దూసుకెళ్లిన కారు

రాయపోల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓ కారు అదుపుతప్పి రోడ్డు దిగి పొలంలోకి దూసుకెళ్లిన సంఘటన మంగళవారం సాయంత్రం రాయపోల్ మండలం కొత్తపల్లి వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లికి చెందిన మహేష్ మంగళవారం సాయంత్రం వరి పొలంలో యూరియా, గుళికలు చల్లడానికి తన కారులో రాయపోల్ నుంచి కొత్తపల్లి వైపు వెళ్లాడు. ఈ క్రమంలో కొత్తపల్లి బస్టాండ్ వద్ద కారు అదుపుతప్పి తన పొలంలోకే దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తుండగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

యువతి అదృశ్యం



నవ్య(ఫైల్)

రామచంద్రాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన సంఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లూరు డబుల్‌బెడ్‌రూం కాలనీలో నివాసం ఉండే హీరాకర్ నవ్య (21) ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నవ్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు నవ్య ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మంగళవారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో యువతి తండ్రి శివాజీ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఇన్‌స్పెక్టర్ రవీందర్ పేర్కొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

● ఆమెతో సహా మరో ముగ్గురు కలిసి దాడి.. ఆస్పత్రిలో వ్యక్తి మృతి



దీపక్ ఠాగూర్ మృతదేహం

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆగ్రహానికి గురైన ఆ మహిళ మరో ముగ్గురితో కలిసి అతడిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన అతను ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు బీడీఎల్ బానూరు సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం.. నందిగామ గ్రామంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో బిహార్‌కు చెందిన దీపక్ ఠాగూర్(30) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ నెల 2న అక్కడే వంట మనిషిగా పని చేసే పశ్చిమ బంగాకు చెందిన ఓ మహిళతో మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ మహిళతో పాటు అదే రాష్ట్రానికి చెందిన గోదాంగ సన్యాసి, సంజయ్ మెండల్, షోబేవ్ సర్కార్‌లు దీపక్ ఠాకూర్‌పై దాడి చేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన అతడిని అక్కడి వారు స్థానికంగా ఓ ఆర్ఎంపీ వద్దకు తరలించారు. అక్కడి నుంచి పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, సోమవారం దీపక్ చనిపోయాడు. లేబర్ కాంట్రాక్టర్ సయ్యద్ మహ్మద్ పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మెదక్ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బెట్టింగ్, జల్సాలకు అలవాటుపడిన మెదక్ పట్టణానికి చెందిన మహ్మద్ అబ్దుల్‌ఖాదిర్, మహ్మద్ అబ్దుల్ షఫీ వారి స్నేహితుడు మహ్మద్ హఫీజ్ వద్ద నుంచి బైక్ తీసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. సోమవారం సాయంత్రం హవేళిఘణపూర్ పోలీసులు ఔరంగాబాద్ తండా శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై అనుమానస్పదంగా వెళ్తున్న వీరిని ఆపే ప్రయత్నం చేయగా తప్పించుకొని పారిపోతుండగా వెంటపడి పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారణ చేయగా మండలంలోని ముత్తాయికోట, జక్కన్నపేట, భూర్గుపల్లి శివారుల్లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్టు ఒప్పుకున్నారు. వారి నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, యూనికాన్ బైక్, రెండు హెల్మెట్లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సీతారాంపూర్, రాజంపేట, బిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఆరుతులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. ఈ బంగారాన్ని హైదరాబాద్‌లో వాల్యూ గోల్డ్ షాపులో అమ్మగా వచ్చిన రూ.2,08,293లను ఇద్దరు పంచుకున్నారన్నారు. వాల్యూగోల్డ్ వారికి నోటీసు ఇచ్చామని, దాన్ని కూడా రికవరీ చేస్తామని తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన ప్రభుత్వ డిగ్రీ విద్యార్థిని

మెదక్ అర్బన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాల మెరుగుదల అంశంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అశ్విత రాష్ట్రస్థాయిలో మెరిసింది. తెలంగాణలోని ఆదివాసీ విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్ తెలిపారు. హైదారబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణలో రాష్ట్ర నలుమూల నుంచి దాదాపు 60 మందికిపైగా పాల్గొనగా.. అశ్విత ఉత్తమంగా నిలిచింది.

జిన్నింగ్ మిల్‌లో అగ్ని ప్రమాదం

● సుమారు రూ. 1.5 కోట్ల నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జోగిపేట, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలంలోని ఓ జిన్నింగ్ మిల్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి బేళ్లతో నిండి ఉన్న మిల్లులో ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో బేళ్లన్నీ కాలిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎర్రారం శివారులోని వైభవ్ మురుగన్ జిన్నింగ్ మిల్లులోని ఓ యంత్రంలో మంగళవారం మధ్యాహ్నం నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. అవి మంటలుగా మారి యంత్రాలకు వ్యాపించి.. ఆపై మిల్లులోని పత్తిబేళ్లకు అంటుకుని.. బేళ్లన్నీ కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు 1.5 కోట్ల నష్టం వాటిల్లిందని మిల్లు యజమానులు భాస్కర్ గుప్తా, శంకర్ గుప్తా తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ. 93,060 రికవరీ, రూ. 56వేల జరిమానా



సోషల్ ఆడిట్ ఇయరింగ్ నిర్వహిస్తున్న అధికారులు

తూప్రాన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో 2023-24 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులకు సోషల్ ఆడిట్ ఇయరింగ్ నిర్వహించారు. తూప్రాన్ మండలంలో రూ.6కోట్ల విలువైన పనులు ఉపాధి హామీ పథకంలో నిర్వహించగా, 15వ విడత సోషల్ ఆడిట్ చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజాదర్బార్ నిర్వహించలేదు. సోషల్ ఆడిట్‌పై తూప్రాన్ ఎంపీపీ కార్యాలయంలో ఇయరింగ్ నిర్వహించారు. ఉపాధి హథకంలో జరిగిన అవకతవకలు, నిర్లక్ష్యంపై రూ. 93,060 రికవరీ, రూ. 56వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అడిషనల్ పీడీ రంగాచార్యులు, జిల్లా విజిలెన్స్ వింగ్ శ్రీహరి, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శేషాద్రి, ఏపీఓ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల భవనానికి గ్రహణం

- రూ.20 కోట్లతో నిర్మాణం
- నిధుల లేమితో ఐదేళ్లుగా సాగుతున్న పనులు
- జిల్లా మంత్రి స్పందిస్తేనే విద్యార్థులకు న్యాయం



పట్టణంలో దేవాదాయశాఖకు చెందిన వందల ఏళ్ల నాటి భవనంలో కొనసాగుతున్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల

సదాశివపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో నిర్మాణంలో ఉన్న మైనార్టీ గురుకుల భవనానికి గ్రహణం పట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో (ప్రధానమంత్రి జన వికాస్ యోజన) పథకం ద్వారా రూ.20 కోట్ల నిధులతో తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ గురుకుల పాఠశాలకు నూతన భవనం నిర్మించేందుకు 2020లో శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో 60 శాతం కేంద్ర ప్రభుత్వం వాటాగా, 40శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాటాగా



నిర్మాణంలో ఉన్న మైనార్టీ గురుకుల భవనం

ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఐదేళ్లుగా నిర్మాణం పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కాంట్రాక్టర్ తాలుకా బిల్లులు రాక పనులు నిలిపివేశారు. భవన నిర్మాణం దాదాపుగా పూర్తయినా ఫ్లోరింగ్, మార్బుల్స్, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, కలరింగ్, ప్రహరీ నిర్మాణ పనులు ఆగిపోయాయి. మరో పక్క మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల విద్యార్థులు అరకొర వసతులు ఉన్న దేవాదాయశాఖకు చెందిన వందల ఏళ్ల నాటి పురాతన భవనంలో ఇరుకు గదులు, అపరిశుభ్ర వాతావరణంలో చదువులు కొనసాగిస్తున్నారు. భోజనాలకు సరిపడా లంచ్ హాల్ లేక విద్యార్థులు చెట్ల కిందనే భోజనాలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. విశాలమైన మైదానం లేకపోవడంతో విద్యార్థులు క్రీడలు, ఆట, పాటలకు దూరమవుతున్నారు. దేవాదాయ శాఖ భవనంలోని క్లాస్‌రూమ్‌లు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలు వస్తే.. నీరు తరగతి గదుల్లో పొంగిపొర్లుతుంది. బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్, మరుగుదొడ్లు దుర్గంధ భరితంగా ఉండడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడం కష్టతరంగా మారింది. ఇప్పటికే రూ.11 కోట్ల నిధులతో భారీ భవన నిర్మాణం జరిగింది. మరో రూ.9 కోట్ల నిర్మాణం పనులు పెండింగ్‌లో పడ్డాయి. జిల్లా మంత్రి నిధుల విడుదలకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొందేందుకు చెల్లించు ఫీజు గడువును పొడిగించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు, తత్కాల్ 13వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఫీజును ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలని సూచించారు. వివరాలకు కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలన్నారు.

బిలాల్‌పూర్‌లో పాత పంటల జాతర

కోహీర్, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సభ్యులు మంగళవారం చిరుధాన్యాల విశిష్టతను వివరిస్తూ పాత పంటల జాతర నిర్వహించారు. ముందుగా గ్రామస్థులతో కలిసి ఎడ్లబండ్లకు పూజచేసి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ లయ, డీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్తీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత పెంచండి

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు నివాసముంటున్న ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. మంగళవారం తెల్లవారుజాము సమయంలో బస్తీల్లో పర్యటించారు. బీరప్పబస్తీల్లో అన్ని రకాల వ్యర్థాలు తొలగించేటట్టు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీల్లో శుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

సంగ్రాంమహరాజ్‌కు సన్మానం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ మహాకుంభమేళాలో పాల్గొని తిరిగొచ్చిన సందర్భంగా బంజారా ఉద్యోగుల సేవా సంఘం బాధ్యులు కొండాపూర్ హనుమాన్ ఆశ్రమంలో సంగ్రాంమహరాజ్‌ను సన్మానించారు. ఇందులో సంఘం జిల్లా, బాధ్యులు నందుసింగ్‌రాథోడ్ ఉన్నారు.

లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ లేబర్ ఆఫీస్ అసిస్టెంట్ అధికారితో పాటు సిబ్బంది విధులకు చుట్టపు చూపుగా హాజరవుతూ.. లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు చిరంజీవి మాట్లాడుతూ వివిధ పథకాలకు లేబర్ కార్డులు అవసరం కావడంతో సకాలంలో అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గానికి సంబంధించి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం నారాయణఖేడ్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా డేవిడ్, పూర్ణచందర్, వీరేశం వ్యవహరించారు. అధ్యక్షుడిగా బీరప్పయాదవ్, ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్, కోశాధికారిగా దత్తుగౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా మనోజ్‌దత్తా, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

జహీరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీమా రంగంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాస్, అశోక్ మాట్లాడుతూ ఆలిండియా ఇన్సూరెన్ ఉద్యోగుల అసోసియేషన్ పిలుపుమేరకు భోజన విరామంలో నిరసన చేపట్టామన్నారు.

సొంత డబ్బులతో సరస్వతీ విగ్రహం ఏర్పాటు

హత్నూర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సొంత డబ్బులతో సరస్వతీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు సరస్వతి విగ్రహాన్ని చూస్తూ చదువులో ముందు వరుసలో ఉండేలా ఈ విగ్రహం దిక్సూచిగా నిలుస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునిపల్లి: 33/11 కేవీ మునిపల్లి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు చెట్లు నరికివేత, ఇతర మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్‌ను నిలిపేస్తున్నామన్నారు. మునిపల్లితో పాటుగా బుదేరా, పొల్కంపల్లి, పెద్దగోపులారం, ఇబ్రహీంపూర్, మల్లారెడ్డిపేట, చిన్నచెల్మెడ, బోడపల్లి, మల్లికార్జునపల్లి, అల్లాపూర్, తక్కడపల్లి గ్రామాల రైతులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

5వ పేజీ తరువాయి

దీంతో రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

పల్లెల్లో పడకేసిన పాలన

రాష్ట్రంలో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి అప్పుడే ఏడాది కావస్తోంది. ప్రస్తుతం పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు పాలనా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమ సొంత శాఖలకు సంబంధించిన విధులకు అదనంగా పంచాయతీల్లో విధులు నిర్వర్తించలేక అధికారులు సతమతమవుతున్నారు. గ్రామసభలు, తీర్మానాలు, వేతనాల చెల్లింపులు, అభివృద్ధి పనుల బిల్లులు చెల్లింపుల్లో నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో 16వ ఆర్థిక సంఘం నిధులు కూడా ప్రతీ నెల విడుదల కావడం లేదు. ఇక రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు కూడా విడుదల కావడం లేదు. ఇక ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగిస్తున్నా గ్రామాల్లో పన్నుల వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఇక అనేక పల్లెల్లో పారిశుధ్యం లోపించి వీధులు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించడానికి వినియోగించే ట్రాక్టర్లకు డీజిల్, మరమ్మతులకు నిధుల కొరత వెంటాడుతోంది. వీధిదీపాల వెలగక అంధకారంగా మారుతున్నాయి.

ఆరు నెలలుగా పెండింగ్‌లో రూ. 40.50 కోట్లు

గడచిన ఆరునెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలకు గ్రాంట్లు విడుదల చేయడం లేదు. ప్రత్యేక పాలనలో పంచాయతీ కార్యదర్శులు అత్యవసర పనులకు తమ స్వంత డబ్బులు వెచ్చించి పనులు పూర్తి చేస్తున్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.40.50 కోట్లు జిల్లాకు రావాల్సి ఉంది. ఆరునెలలుగా ఈ నిధులు పెండింగ్‌లోనే ఉన్నాయి. జనవరి నెలకు సంబంధించి జిల్లాలో 1,679 మంది మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి.

పెండింగ్ బిల్లులు చెల్లించమంటే అరెస్టులా..?



ఖేడ్ పోలీసులు అరెస్టు చేసిన మాజీ సర్పంచులు



పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

నారాయణఖేడ్/జిన్నారం/జహీరాబాద్/పాపన్నపేట/మెదక్/రామాయంపేట/చేగుంట/ నిజాంపేట/చిన్నశంకరంపేట/రేగోడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచుల సంఘం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామునే ఖేడ్ పోలీసులు పలువురు మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిచారు. అరెస్టైన వారిలో తుర్కపల్లికి చెందిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పరమేష్, రుద్రారంకు చెందిన ప్రభాకర్, చాప్టాకెకు చెందిన సంగప్ప, నమ్లీమేట్‌కు చెందినసత్యపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. జిన్నారంలో మాజీ సర్పంచులు ఆంజనేయులు, జనార్ధన్, శివరాజ్, నాయకులు నరేందర్, జహీరాబాద్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు చిన్నపాటిల్, విజయ్ కుమార్, మెదక్ జిల్లా పాపన్నపేటలో సర్పంచుల అరెస్ట్‌పై మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పాపన్నపేట మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు గురుమూర్తిగౌడ్, లింగారెడ్డి, జగన్, దానయ్య, ఎంపీటీసీలు కుబేరుడు అరెస్టైయ్యారు. రామాయంపేట, చేగుంట మండలాల్లోని మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేసి, సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అప్పులు చేసి అభివృద్ధి చేశామని మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంపేటలో ఆయన మాట్లాడారు. ఇందులో సర్పంచ్ గేరుగంటి అనూష, నర్సింహులు ఉన్నారు. చిన్నశంకరంపేటలో సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు యాదగిరియాదవ్, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి ప్రభాకర్, రేగోడు మండలంలో సర్పంచుల ఫోరం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకే రమేష్, మాజీ సర్పంచులు నర్సింహులు, రవీందర్, నాయకులు హనుమంతు, అంజయ్య, సురేందర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

సమస్యల సాధనలో సంఘటితమవుదాం

- మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ



మొగుడంపల్లిలో 'లక్షడప్పులు-వేలగొంతుకలు' గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

జహీరాబాద్/కోహీర్/చేగుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యల సాధన కోసం అందరం సంఘటితమవుదామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో 'లక్షడప్పులు-వేల గొంతుల' గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్, సురేష్, సంపత్, ప్రబాకర్, కృపాకర్, మోహన్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కోహీర్‌లో 'లక్షడప్పులు-వేల గొంతుల' కార్యక్రమానికి సంబంధించి డప్పుల కొనుగోలు కోసం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి రూ.20 వేలను ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రవికుమార్‌కు అందజేశారు. చేగుంటలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో 'లక్షడప్పులు-వేల గొంతుల' గోడపత్రికను విడుదల చేశారు.

ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలి



పుల్‌కల్: రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో రామలింగం

నారాయణఖేడ్/పుల్‌కల్/పెద్దశంకరంపేట/తూప్రాన్/ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలను రూపొందించే విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు-2025 నిర్వహణలో భాగంగా రెండోవిడత అధనపు ఓటర్ల జాబితా, ప్రచురణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లోని నూతన ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. తూప్రాన్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల సమావేశం ఎంపీడీవో శేషాద్రి అధ్యక్షతన నిర్వహించారు.

మురుగు సమస్యలు పరిష్కరించాలి

- కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలం చెల్లిన పైపులను తొలగించి నూతన పైపులైన్‌లు వేయడానికి నిధులు మంజూరు చేయాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాలనీల్లో నిత్యం మురుగు సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. పూర్తిస్థాయిలో పైపులు ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నిలకు సంబంధించి నిజాంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రంతో పాటు మండల కేంద్రమైన మనూరులోని 197 పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎన్నికల నోడల్ అధికారి, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ సోమేశ్వర్‌రావు, నిజాంపేట తహసీల్దార్ నాగజ్యోతి పరిశీలించారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ.జాన్సన్, రెవెన్యూ సిబ్బంది శ్రీకాంత్, పండరి ఉన్నారు.

నమూనా ఇందిరమ్మ ఇంటి కోసం స్థల పరిశీలన

పాపన్నపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నమూనా ఇందిరమ్మ ఇల్లు నిర్మించడానికి కార్యాలయ ఆవరణలో స్థల పరిశీలన చేసినట్లు ఎంపీడీవో విష్ణువర్ధన్, హౌసింగ్ ఏఈ విద్యాసాగర్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక నాయకులతో మాట్లాడి స్థలాన్ని ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒకటి చొప్పున నమూనా ఇళ్ల నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పాపన్నపేటలో స్థల పరిశీలన చేశామన్నారు.



సంగారెడ్డిలోని శ్రీ వైకుంఠపురంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దశంకరంపేట శిశుమందిర్‌లో సూర్య నమస్కారం చేస్తున్న విద్యార్థులు



సంగారెడ్డిలో నిర్వహించిన శోభాయాత్రలో శివస్వాములు

వైకుంఠపురంలో వైభవంగా రథోత్సవం

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/నిజాంపేట/పెద్దశంకరంపేట/సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీ వైకుంఠపురం ఆలయ 12వ వార్షిక బ్రహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. మంగళవారం రథసప్తమి సందర్భంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవనాథ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో రథోత్సవం, తెప్పోత్సవాన్ని నిర్వహించారు. నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో తిరుమలస్వామి రథ సప్తమి వేడుకలు మంగళవారం జరిగాయి. అలాగే కల్యాణంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఎడ్లబండ్ల ఊరేగింపు, జాతరకు వచ్చి భక్తులకుకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పెద్దశంకరంపేటలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో రథసప్తమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రధాన ఆచార్యులు వీరప్ప, ఆచార్య బృందంతో పాటు విద్యార్థులందరూ సామూహికంగా సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, పాఠశాల అధ్యక్షుడు దాదిగారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శివమహాదేవుని శోభాయాత్ర

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమిని పురస్కరించుకుని శివమహాదేవుని రథయాత్ర శోభాయమానంగా సాగింది. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం నుంచి నుంచి పాత బస్టాండ్ వద్ద గల సోమేశ్వర శివాలయం వరకు రథోత్సవం నిర్వహించారు.

రామేశ్వరంబండలో ఎల్లమ్మ జాతర

పటాన్‌చెరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామేశ్వరంబండలో మంగళవారం రేణుకాఎల్లమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు అమ్మవారికి పెద్దఎత్తున బోనాలను సమర్పించారు. ఒగ్గు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కళా ప్రదర్శన ఆకట్టుకున్నది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్‌గౌడ్ జాతరలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

జిన్నారం, ఫిబ్రవరి, 4 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కిష్టయ్యపల్లిలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి మ్యాక్‌సొసైటీ కాలనీలో మంగళవారం పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిపారు. కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన పోచమ్మ దశమ వార్షికోత్సవాలు

మెదక్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తొగర్‌పల్లిలో మూడురోజులుగా కొనసాగుతున్న సప్తముఖి పోచమ్మదేవి దశమ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. భక్తులకు ఆలయ ధర్మకర్త ప్రసాద్ గౌడ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మొండిబకాయిలపై కఠినంగా వ్యవహరించండి



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవాడలోని మూతపడిన పరిశ్రమల విషయంలో పన్ను బకాయిలు పేరుకుపోతున్నందున కఠినంగా వ్యవహరించి పన్నులు వసూలు చేయాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం బిల్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వందశాతం పన్నులు వసూలు చేయడానికి ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్లి పన్నులు చెల్లించాలంటూ అభ్యర్థన చేయాలని కోరారు. పరిశ్రమల విషయంలో కోటి రూపాయల వరకు మొండి బకాయిలు ఉన్నందున న్యాయస్థానం ద్వారా వసూలు చేసే అంశంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వో నర్సింహులు పాల్గొన్నారు.

రంగోత్సవంలో విద్యార్థులకు బంగారు పతకం



బంగారు పతకంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మనోహరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రంగోత్సవం పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బంగారు పతకం సాధించారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి రంగోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. ఇందులో 15 బంగారు, 5 వెండి, 2 కాంస్య పతకాలు, ఒకటి సర్‌ప్రైజ్ బహుమతి గెలుపొందినట్లు ప్రధానోపాధ్యాయుడు నర్సింగం తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి

పాపన్నపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాతను రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కోర్టు సీనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్ చంద్ కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ, పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఎల్ఈడీ టీవీ



ఎల్ఈడీ టీవీ అందజేస్తున్న నాయకులు

శివ్వంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా తన సొంత నిధులు రూ.30 వేలతో పాఠశాలకు ఎల్ఈడీ టీవీని మంగళవారం బహూకరించారు. ఇందులో మాజీ ఉపసర్పంచ్ రాజపేట పద్మావెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

అలియాబాద్‌లో ఉర్సె షరీఫ్

మెదక్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి అలియాబాద్‌లో ఉర్సె షరీఫ్ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వాహకుడు ఫహీం భక్తులతో కలిసి దీపారాధన చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని ఆయన వెల్లడించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

మనోహరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో అన్నివర్గాలకు న్యాయం చేకూరుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ చౌరస్తా వద్ద మోదీ, నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ మాట్లాడారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు నగేష్, మాజీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, తదితరుల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'ఆసక్తి పెంచుకునేందుకే క్రికెట్ పోటీలు'

నర్సాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల ఆసక్తి పెంచుకునేందుకే క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, సీనియర్ నాయకుడు శ్రీధర్‌గుప్తా పేర్కొన్నారు. నర్సాపూర్‌లో జనవరి 26వ తేదీ నుంచి ప్రారంభమైన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన పోటీలకు శ్రీధర్‌గుప్తా టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం యువత సెల్‌ఫోన్లతో పాటు ఆన్‌లైన్ ఆటలపై పడి క్రీడలకు దూరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, మాజీ వార్డుసభ్యుడు రషీద్, సురేష్‌నాయక్, ఉదయ్ పాల్గొన్నారు.